సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 13 । జూన్‌ । 2024



ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణ హత్య

ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురైన సంఘటన నార్నూర్‌ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. 8లో▸

అందుబాటులో పత్తి విత్తనాలు

ఎదులాపురం: జిల్లావ్యాప్తంగా 343 విత్తన డీలర్‌ షాపుల్లో 3,84,095 పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ప్రకటనలో పేర్కొన్నారు. డీలర్లు అధిక ధరకు విక్రయించినా, ఇబ్బందులకు గురి చేసినా 80748 12429, 93927 79149 నంబర్లలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.0/27.0

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

కృత్రిమ విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్‌ రాజర్షి షా



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజర్షిషా

ఇంద్రవెల్లి: విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్‌ రాజర్షి షా హెచ్చరించారు. మండల కేంద్రంలోని సీడ్స్‌, ఫర్టిలైజర్‌ దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. స్టాక్‌ బోర్డు, రిజిస్టర్ల నిర్వహణతో పాటు గోదాంను పరిశీలించారు. విత్తన కొరత అంటూ అధిక ధరకు విక్రయిస్తే షాపులను సీజ్‌ చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండలకేంద్రంలో కొనసాగుతున్న మిషన్‌ భగీరథ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఎంపీపీ శోభాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్‌ ప్రవీణ్‌కుమార్‌, ఎంపీడీవో భాస్కర్‌ తదితరులున్నారు.

ప్రొవిజినల్‌ పదోన్నతుల జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్‌: ఎస్జీటీల పదోన్నతులకు సంబంధించి ప్రొవిజినల్‌ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. 1:3 నిష్పత్తిలో జాబితా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రెండు, అంతకంటే ఎక్కువ కేటగిరీలో పదోన్నతి కోసం విల్లింగ్‌ చూపిస్తే వేరే కేటగిరీలో నాట్‌విల్లింగ్‌ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే గురువారం మధ్యాహ్నం ఒంటి గంట లోపు డీఈవో కార్యాలయంలో ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు.

న్యాక్‌ శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్‌: భవన నిర్మాణ, ఎలక్ట్రీషియన్‌, మేస్త్రీ, పెయింటింగ్‌ కార్మికులకు 15 రోజుల పాటు న్యాక్‌ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏడీ నాగేంద్రం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.300 చొప్పున స్టైఫండ్‌తో పాటు హెల్మెట్‌, టీషర్ట్‌, మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9866565156 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

బజార్‌హత్నూర్‌: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని ఏడీఏ శ్రీధర్‌స్వామి అన్నారు. మండలంలో విత్తన దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, గోదాముల్లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన సమయంలో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో ప్రమోద్‌రెడ్డి, ఏఈవోలు సంతోష్‌, కృష్ణపాల్‌, భోజన్న, రాము, రాజేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

'నీట్‌'లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న కలెక్టర్‌

కైలాస్‌నగర్‌: నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన పట్టణంలోని ఓ ప్రైవేట్‌ కళాశాలకు చెందిన విద్యార్థులను కలెక్టర్‌ రాజర్షి షా బుధవారం సన్మానించారు. విద్యార్థులు ఇక్రా అక్సాని, అమీమా ఫిరాజ్‌, హాదీయ తస్నీం, అయిమన్‌ ఖానం, మహేక్‌ నాజ్‌ అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వీరితో పాటు వివిధ ప్రాంతాల్లో చదివిన పట్టణానికి చెందిన అబ్దుల్‌ అబ్బాస్‌, హుమేరా ఖానం, సాయిఫా తబస్సుమ్‌, షబియా, బుష్‌రా సుల్తానా సైతం నీట్‌లో సత్తా చాటి ఎంబీబీఎస్‌ సీటు పొందారు. వీరిని కలెక్టర్‌ శాలువాలతో సత్కరించారు. సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు.



జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

మోగిన బడిగంట



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్‌ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు తదితరులు



చిన్నారిని పాఠశాలకు తీసుకువెళ్తున్న తల్లి

- జిల్లాలో తొలిరోజు విద్యార్థుల హాజరు అంతంతే
- పూర్తిస్థాయిలో పంపిణీ కాని పుస్తకాలు, యూనిఫాం
- సందడిగా మారిన పాఠశాలలు



గెజిటెడ్‌ నం.1 పాఠశాలలో విద్యార్థులకు పూలు అందించి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్‌: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్ని రోజులు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బుధవారం బడి గంట కొట్టగానే పాఠశాలలకు చేరుకున్నారు. కొంతమంది మారాం చేయగా తల్లిదండ్రులు వారిని బలవంతంగా తీసుకెళ్లడం కనిపించింది. సర్కారు, ప్రైవేట్‌ పాఠశాలలను తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు గేటు వద్ద పూలు అందించి స్వాగతం పలికారు. స్కావెంజర్లు లేకపోవడంతో పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులే గదులను శుభ్రం చేస్తూ కనిపించారు. తొలిరోజు పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తక్కువగా కనిపించింది. 67వేల మందికి గాను 20వేల మంది మాత్రమే హాజరైనట్లు అధికారులు చెబుతున్నారు. మొదటి రోజు వచ్చిన విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాం అందించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో పలుచోట్ల కలెక్టర్‌, ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. అలాగే ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

మారని బడి..

ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలికినట్లు కనిపించాయి. కొన్ని బడులు మారలేదు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం, తరగతి గదుల్లో చెత్తాచెదారంతో దర్శనమిచ్చాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు చేపట్టినప్పటికీ ఇంకా చాలా వరకు అవి కొనసాగుతున్నాయి.

పూర్తిస్థాయిలో అందని పుస్తకాలు, యూనిఫాం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మొదటి రోజు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం ఇస్తామని అధికారులు చెప్పినప్పటికీ అవి పూర్తిస్థాయిలో అందలేదని తెలుస్తోంది. పాఠ్య పుస్తకాలతో పాటు నోటు బుక్‌లు సైతం విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. అయితే 4లక్షల 57వేల 700 పుస్తకాలు అవసరం ఉండగా, ఇంకా 20వేల పాఠ్య పుస్తకాలు జిల్లాకు రావాల్సి ఉంది. ఇప్పటివరకు 3లక్షల 40వేల వరకు పుస్తకాలను సరఫరా చేశారు. యూనిఫాం 67,418 జతలు కుట్టాల్సి ఉండగా, 63వేల వరకు మాత్రమే పూర్తయింది. అయితే మొదటి రోజు 20వేల మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు చెబుతున్నారు. పాఠశాలకు వచ్చిన వారందరికీ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు అందించినట్లు వివరించారు.

బడిబాటలో ప్రజాప్రతినిధులు

పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్‌ బుక్కులు పంపిణీ చేశారు. నార్నూర్‌ మండలంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంద్రవెల్లి మండలంలోని ఎంపీపీఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌ రాజర్షిషా, ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ నేరడిగొండ మండలంలోని జెడ్పీఎస్‌ఎస్‌ వడూర్‌ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ పాఠశాలలో ఎంపీ నగేశ్‌, ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌ పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని, ఈ మేరకు తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని కలెక్టర్‌ రాజర్షిషా, ఖానాపూర్‌ ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌–2లో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడులను ప్రైవేట్‌కు ధీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. ఆయా పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు విద్యార్థులకు యూనిఫాం,పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శోభాబాయి, జెడ్పీటీసీ పుష్పలత, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్‌ ప్రవీణ్‌ కుమార్‌, ఎంపీడీవో భాస్కర్‌, ఎంఈవో నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గులు వేసి.. విద్యార్థులను ఆహ్వానించి

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌ జెడ్పీ పాఠశాల గేటు ఎదుట విద్యార్థినులు బుధవారం ముగ్గులు వేసి విద్యార్థులకు ఆహ్వానం పలికారు. వారిని ఉపాధ్యాయులు బుచ్చి బాబు, రమేశ్‌ తదితరులు అభినందించారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పత్తి విత్తేశారు!



ఇతని పేరు సిరిగిరి వినోద్‌. తాంసి మండలం వడ్డాడికి చెందిన రైతు. ఇతనికి గ్రామ శివారులో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ వానాకాలంలో 10 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఐదు రోజుల క్రితం విత్తనాలు వేశాడు. మంచి వర్షాలు కురిస్తే మొలకలు వస్తాయి. లేనిపక్షంలో విత్తన దశలోనే నష్టం చవిచూసే పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది రైతులు ఇలాగే వరణుడిపై భారం వేసి సాగుకు కదిలారు.

తాంసి మండలం జామిడి గ్రామంలో రైతు రాంరెడ్డి వారం క్రితం ఐదెకరాల్లో పత్తి విత్తనాలు వేశాడు. ప్రస్తుతం మొలకలు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికీ ఓ మోస్తరు వర్షం కూడా కురవలేదు. మంచి వాన పడితేనే మొక్కల ఎదుగుదలకు దోహద పడుతుంది. లేనిపక్షంలో సరైన దిగుబడి అందని పరిస్థితి ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.





ఆదిలాబాద్‌ మండలం బట్టిసావర్గాం చేనులో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

- నైరుతి సమాచారంతోకదిలిన రైతులు
- పొడి దుక్కుల్లో వద్దంటున్న శాస్త్రవేత్తలు
- 20 శాతం మించలేదంటున్న వ్యవసాయ శాఖ
- అనధికారికంగా 40 శాతం వరకు అంచనా
- తొలకరి తర్వాత ఏటా ఇదే పరిస్థితి

జిల్లాలో వానాకాలం సాగు అంచనా..
అన్ని పంటల సాగు విస్తీర్ణం: 5,79,546 ఎకరాలు
పత్తి విస్తీర్ణం : 4,16,969 ఎకరాలు

వర్షపాతం వివరాలు (జూన్‌ 1 నుంచి 12 వరకు)
సాధారణం :39.9 మి.మీ.లు
కురిసింది: 23.8 మి.మీ.లు

సాక్షి,ఆదిలాబాద్‌: వానాకాలం సీజన్‌ మొదలైంది. జిల్లాలో తొలకరి సైతం పలకరించింది. అయితే జూన్‌ 1 నుంచి ఇప్పటివరకు కేవలం 4 రోజుల్లో మాత్రమే జల్లులు కురిశాయి. వ్యవసాయ భూముల్లో ఇంకా తేమ శాతం రాలేదు. అయితే రైతులు సంప్రదాయంగా జూన్‌ మొదట్లోనే పత్తి సాగుకు సిద్ధమయ్యారు. మృగశిరకార్తె ప్రవేశం, నైరుతి రుతుపవనాలు విస్తరించాయనే సమాచారంతో పలువురు పత్తి విత్తనాలు విత్తారు. మరోవైపు పొడి దుక్కుల్లో విత్తనాలు వేయవద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఒకవేళ సరైన వర్షాలు కురవకపోతే విత్తన దశలోనే రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు.

కొద్ది మంది రైతులే..

కొద్దిమంది రైతులు మాత్రమే ఇప్పటికే పత్తి సాగు చేశారని వ్యవసాయ శాఖ చెబుతుంది. పలు మండలాల్లో అనధికారికంగా 40 శాతం వరకు రైతులు పత్తి సాగు చేశారని మండల వ్యవసాయ అధికారుల దృష్టికి వచ్చింది. అయితే అధికారికంగా వారు చెప్పలేని పరిస్థితి. పొడి దుక్కుల్లో కొన్నిసార్లు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తేలికపాటి వర్షాలకు విత్తనం నాటితే మొలక శాతం తగ్గిపోతుందని చెబుతున్నారు. ఒక్కోసారి విత్తనం కుళ్లిపోతుందని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ పత్తి విత్తనాలు నాటుకోవాల్సి వస్తుందని అంటున్నారు.

60 మి.మీ.లు పడిన తర్వాతే..



వర్షపాతం సుమారుగా 60 మి.మీ.ల నుంచి 70 మి.మీ.ల వరకు పడిన తర్వాతే భూమిలో తేమ శాతం పెరుగుతుంది. అప్పుడు విత్తనాలు నాటితే మంచి మొలకలు వస్తాయి. జూన్‌ 15 నుంచి జూలై 15 వరకు పత్తి విత్తనాలు వేసుకునేందుకు సమయం ఉంది. జూలై 20 వరకు కూడా వేసుకోవచ్చు. రైతులు భూమిలో తేమ శాతం పెరిగిన తర్వాత నాటితే విత్తన నష్టాన్ని అధిగమించవచ్చు.

– డాక్టర్‌ వి.రాంప్రసాద్‌, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆదిలాబాద్‌

10 నుంచి 20 శాతం మంది రైతులే..



10 నుంచి 20 శాతం మంది రైతులే పత్తి సాగు చేశారు. రైతులు మంచి వర్షాలు కురిసిన తర్వాత విత్తనాలు నాటుకోవాలి. నాణ్యమైన వాటినే కొనుగోలు చేయాలి. అలాగే రశీదులు, విత్తన ప్యాకెట్‌ కవర్లను రైతులు భద్రపరుచుకోవాలి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

భూకబ్జాపై కలెక్టర్‌కు విచారణ నివేదిక



వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో జీవాకర్‌రెడ్డి

కైలాస్‌నగర్‌: జిల్లా కేంద్రంలోని వార్డునంబర్‌ 38 కైలాస్‌నగర్‌నగర్‌లోని సొసైటీకి సంబంధించిన రూ.కోట్ల విలువైన రెండు ప్లాట్లను తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కొందరు ఆక్రమించినట్లు ఆ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు ఆదిలాబాద్‌ ఇన్‌చార్జి, ఉట్నూర్‌ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ ఎండీ.ఖమర్‌ అహ్మద్‌తో కలిసి బుధవారం ఆ ప్లాట్ల స్థలాన్ని సందర్శించారు. వాటికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడేందుకు యత్నించగా వారి ఫోన్లు స్విచ్చాఫ్‌ ఉండటంతో అందుబాటులోకి రాలేదు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లుగా ఆర్డీవో తెలిపారు. ఇందులో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోక ప్రవీణ్‌రెడ్డి, ముత్యాల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బోథ్‌ ఎమ్మెల్యే



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌

నేరడిగొండ: బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ బుధవారం కలెక్టర్‌ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలిసి బోథ్‌ నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈమేరకు కలెక్టర్‌ సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పాండు, తిరుమల్‌ గౌడ్‌, సుభాష్‌, గంగయ్య, తదితరులున్నారు.

విద్యుత్‌ సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎస్‌ఈ జేఆర్‌ చౌహాన్‌



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎస్‌ఈ చౌహాన్‌

ఆదిలాబాద్‌టౌన్‌: విద్యుత్‌ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఆ శాఖ ఎస్‌ఈ జేఆర్‌ చౌహాన్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్‌ నిర్వహించారు. వినియోగదారుల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్‌ఈ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంస్థ ఎండీ ఆదేశాల మేరకు గ్రీవెన్స్‌ సెల్‌ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ ఇళ్లలో ఎర్తింగ్‌ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేకుంటే విద్యుత్‌ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అకౌంట్‌ ఆఫీసర్‌ శంకర్‌, డీఈ శివప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి అన్ని విధాలా కృషి

- ఎంపీ గోడం నగేశ్‌



ఎంపీ నగేశ్‌, ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

ఆదిలాబాద్‌: పార్లమెంట్‌ పరిధిలో క్రీడాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఆదిలాబాద్‌ ఎంపీ గోడం నగేశ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఒలింపిక్‌ అసోసియేషన్‌ సభ్యులు బుధవారం ఎంపీతో పాటు ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి సన్మానించారు. జిల్లాలో క్రీడా సదుపాయాల కల్పన, ఇతర సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. జిల్లాలో క్రీడారంగం ప్రగతికి, అలాగే ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి అన్ని వసతులు కల్పించేలా స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి కృషి చేస్తానని భరోసా నిచ్చారు. ఎమ్మెల్యే శంకర్‌ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఖేలో ఇండియాలో భాగంగా ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్‌ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, హాకీ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరెడ్డి పార్థసారథి, రాష్ట్ర పాల్‌, మహేందర్‌, హరిచరణ్‌, నాందేవ్‌, కృష్ణ, వేదవ్యాస్‌ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

ఆదిలాబాద్‌టౌన్‌: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. పట్టణంలోని టీచర్స్‌ కాలనీలో గల ఓ ప్రైవేట్‌ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ వారి భవితకు బంగారు బాటలు వేయాలని సూచించారు. మహిళా సాధికార కేంద్రం కోఆర్డినేటర్‌ యశోద మాట్లాడుతూ, మహిళల హక్కులు, హెల్ప్‌లైన్‌ నంబర్‌, పోక్సో చట్టాలు, విద్యార్థుల హక్కులపై అవగాహన కల్పించారు. ఇందులో జిల్లా సంక్షేమ అధికారి సబిత, పాఠశాల ప్రిన్సిపాల్‌ క్రాంతికుమార్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సౌజన్య

క్లుప్తంగా

ముగ్గురు విద్యార్థులు.. 12 మంది టీచర్లు


తరగతి గదిలో కూర్చున్న విద్యార్థి రాజు

కుంటాల: వేసవి సెలవుల అనంతరం బుధవారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కుంటాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పదోతరగతి విద్యార్థి ఒక్కడే సమయానికి వచ్చాడు. 12 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటల తర్వాత మరో ఇద్దరు విద్యార్థులు కార్తీక్ (పదోతరగతి), యోగేశ్ (తొమ్మిదో తరగతి) వచ్చారు. మొత్తంగా ముగ్గురు విద్యార్థులే హాజరయ్యారు. వీరికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను ఎంఈవో ముత్యం పంపిణీ చేశారు.

నిర్మల్‌లో అరుదైన వైద్యం


డాక్టర్‌ను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు


చికిత్స పొందుతున్న బాబు

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన దానవేని వైష్ణవి–సృజన్ దంపతులకు గత నెల 29న బాబు జన్మించాడు. పుట్టుకతోనే శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో జిల్లా కేంద్రంలోని సుశ్రుత ఆస్పత్రిలో చికిత్స చేయించారు. పిల్లల డాక్టర్ కే మురళీధర్ ఐసీడీ ట్యూబ్ అనే ఆపరేషన్ నిర్వహించి శ్వాస సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా బాబు కుటుంబ సభ్యులు డాక్టర్‌ను శాలువాతో సన్మానించారు.

దుబాయిలో గల్ఫ్ కార్మికుడి ఆత్మహత్య


గంగారాం (ఫైల్)

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెవాడ గ్రామానికి చెందిన కుంచపు గంగారాం (37) అనే గల్ఫ్ కార్మికుడు మంగళవారం అర్ధరాత్రి దుబాయిలోని సార్జాలో గల గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం ఐదునెలల క్రితం రూ.4లక్షల అప్పు చేసి ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. ఏజెంట్ చెప్పినట్లు కంపెనీ పని, క్లినిక్ వర్క్ కాకుండా సప్లయ్ పని ఇవ్వడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇటీవల ఇంటికి ఫోన్ చేసి ఈ విషయమై బాధపడ్డాడు. అప్పు చేసిన వచ్చిన తాను తిరిగి ఇంటికి వెళ్లలేక మదనపడ్డాడు. ఈ క్రమంలో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గంగారాంకు భార్య గంగామణి, ఇద్దరు కుమారులున్నారు. మృతదేహాన్ని వెంటనే స్వగ్రామానికి తెప్పించేలా ప్రభుత్వంతో పాటు గల్ఫ్ కార్మిక సంఘాలు కృషి చేయాలని బాధిత కుటుంబీకులు కోరుతున్నారు.

పంట మార్పిడితో ప్రయోజనాలెన్నో..

- తగ్గనున్న చీడపీడల ఉధృతి
- సారవంతం కానున్న నేలలు
- అధిక దిగుబడికి అవకాశం


లక్ష్మణచాందలో కూరగాయల సాగు


లోకేశ్వరంలో విత్తనం వేస్తున్న రైతులు

లోకేశ్వరం/లక్ష్మణచాంద: ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా సాగు చేస్తే భూసారం దెబ్బతింటుంది. చీడపీడల ఉధృతి పెరుగుతుంది. పంటలకు హాని కలిగించే పురుగు జీవితచక్రం నిరాటంకంగా సాగుతుంది. పంట మార్పిడితో ఇలాంటి పరిస్థితిని నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, లక్ష్మణచాంద ఏవో ప్రవీణ్‌కుమార్ సూచిస్తున్నారు. పంట మార్పిడితో ఎన్నో ప్రయోజనాలున్నాయని పేర్కొంటున్నారు. వారు చేసిన మరిన్ని సూచనలు..

పంటమార్పిడి ఎందుకంటే..

జిల్లాలోని సారంగపూర్, మామడ, దిలావర్‌పూర్, కుంటాల, కుభీర్, తానూర్, ముథోల్, బాసర మండలాల్లో రైతులు పంట మార్పిడి విధానం పాటిస్తున్నారు. కానీ.. కొన్ని మండలాల్లో ఎక్కువగా వరి మాత్రమే వేస్తుంటారు. వానాకాలం, యాసంగిలో భిన్నమైన పంటలు సాగు చేస్తే చీడపీడల ఉధృతిని నివారించవచ్చు. సాధారణంగా ఒక పంటను ఆశించే పురుగులు మరొక పంటను ఆశించవు. పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవితచక్రం ఛేదించబడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. వేగంగా ఉత్పత్తి అయ్యే కొన్ని రకాల పురుగులను అదుపులో పెట్టవచ్చు.

పంట మార్పిడి ఆవశ్యకత

సాధారణంగా నీటి వసతులున్నచోట ఎక్కువగా వరి వేస్తుంటారు. వాణిజ్య పంటలు పండిస్తుంటారు. వరి, వేరుశెనగ, జొన్న, మొక్కజొన్న లాంటి పైర్లు నేల పైపొరల నుంచి.. పత్తి, మిరప, కంది లాంటి వేర్లు నేల లోపలి పొరల నుంచి పోషకాలు తీసుకుంటాయి. దీంతో క్రమంగా నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతింటుంది. అలాగే ఈ పైర్లను ఆశించే చీడపీడలు స్థిర నివాసం ఏర్పరచుకుంటాయి. ఇవి అభివృద్ధి చెందుతూ తర్వాత పంటకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. పంట మార్పిడి క్రమంలో ఆహార, వాణిజ్య పంటలు ఒకసారి.. పప్పుజాతి (చిక్కుడు) పైర్లు మరోసారి మార్పిడి చేస్తుండాలి. అవసరమైనప్పుడు పశుగ్రాసం కోసం గడ్డి జాతి పైర్లు, భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట సాగు చేసుకోవచ్చు. పప్పుజాతి పైర్లతో పంట మార్పిడి చేస్తే వీటి వేర్లు, బుడిపెలలోని రైజోబియం సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

ప్రయోజనాలివీ..

- వరి వేసే పొలంలో ముందుగా పప్పుజాతి పైర్లు వేస్తే నేల సారవంతమవుతుంది.
- వేరుశెనగలో ఆకుముడత నివారించడానికి పప్పు జాతికి చెందిన పైరుతో మార్పిడి చేయాలి.
- కంది, మిరపలో ఎండు తెగులు నివారణకు జొన్న, మక్క పంటలతో మార్పిడి చేయాలి.
- కంది పంటను జొన్న, మొక్కజొన్న, నువ్వు లాంటి పంటలతో మార్పిడి చేస్తే కాయ తొలిచే పురుగు ఉధృతి తగ్గుతుంది.
- నులిపురుగుల సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశెనగ, మిరప లాంటి పైర్లను కొన్ని పంటకాలాలు తప్పనిసరిగా ఆపాలి.
- టమాటా లాంటి పంటలు వేసిన తర్వాత అందులో మిరప సాగు చేయరాదు.
- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పెసర, మినుము, వేరుశెనగతో పంట మార్పిడి చేయాలి.
- పంట మార్పిడితో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.
- భూమిలో చీడపీడల బెడద తగ్గుతుంది. దిగుబడి ఎక్కువ వస్తుంది.
- నేల భౌతిక స్వరూపం మారుతుంది.
- శిలీంద్రాలతో వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చు.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చూసుకోవచ్చు.
- పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంది.
- వానపాముల అభివృద్ధి ఎక్కువగా ఉంటుంది.

భైంసాలో అక్రమంగా విత్తన విక్రయాలు

- టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో వెలుగులోకి..


తనిఖీ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

భైంసాటౌన్: పట్టణంలోని గాంధీగంజ్‌లో పలు విత్తన విక్రయ దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ విత్తనాలు విక్రయం, అధిక ధరలకు అమ్మకాలపై రైతులను ఆరా తీశారు. అలాగే ఆయా దుకాణాల్లో స్టాక్, అమ్మకం వివరాలు తనిఖీ చేశారు. కాగా, ఇద్దరు వ్యాపారులు పీసీ (ప్రిన్సిపల్ సర్టిఫికెట్)పై దుకాణం పేరు లేకుండా విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారం రోజుల వరకు సదరు దుకాణాదారులు విత్తనాలు విక్రయించవద్దని ఆదేశించారు. కొన్ని దుకాణాల్లో బిల్లులపై రైతుల సంతకాలు లేకుండానే విక్రయించినట్లు తేల్చారు. దీంతో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని దుకాణాదారులను హెచ్చరించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో ఏడీఏ విద్యాసాగర్, టీఎస్‌ఎస్‌డీసీ డీఎం అతుల్‌కుమార్ జైన్, ఏవో రాంచందర్‌నాయక్, ఎస్సై ఎండీ గౌసొద్దీన్ ఉన్నారు.

ఆవులను తరలిస్తున్న వాహనం పట్టివేత


పట్టుబడ్డ ఆవులతో హిందూవాహిని కార్యకర్తలు

సారంగపూర్: మండలంలోని ధని గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి ఓ వర్గానికి చెందిన వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న ఐదు ఆవులను మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నామని హిందూవాహిని కార్యకర్త అఖిల్‌గౌడ్ తెలిపారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్నారని ముందుగా అందిన సమాచారం మేరకు నిర్మల్–స్వర్ణ ప్రధాన రహదారిపై ధని వద్ద కాపలా ఉన్నామని పేర్కొన్నారు. ఇదే క్రమంలో ట్రాలీ ఆటోలో ఐదు ఆవులను తరలించడం గమనించి సదరు వాహనాన్ని ఆపామని తెలిపారు. అందులో ఉన్న ఐదు ఆవులను జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ ఆలయ గోశాలకు తరలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూవాహిని కార్యకర్తలు నూతన్‌కుమార్, అరుణ్, పవన్, సందీప్, చరణ్, తదితరులున్నారు.

మహిళ కాళ్ల పైనుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు


బస్సు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మహిళ

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా నడపడంతో సుజాత తీవ్రంగా గాయపడింది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన సుజాత బుధవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నివాసం ఉంటున్న తన కూతురు వద్దకు బస్సులో వచ్చింది. బస్సు దిగి బస్టాండ్ వెలుపలికి వెళ్తుండగా అప్పుడే వెనక్కి తీస్తున్న మరో బస్సు(నిర్మల్‌డిపో) సుజాతను ఢీకొంది. దీంతో ఆమె బస్సు వెనుక చక్రాల కింద పడడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. పోలీసులు బాధితురాలిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలో ని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా మహిళ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు. బస్సును అజాగ్రత్తగానడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గుడుంబా విక్రేతల బైండోవర్


గుడుంబా విక్రేతలను బైండోవర్ చేస్తూ..


గుడుంబా తయారీ సామగ్రితో అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పలువురు గుడుంబా విక్రేతలను ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ శివరాజ్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు ఎక్సైజ్ ఎస్సై అభిషేక్ మాట్లాడారు. గుడుంబా విక్రయిస్తూ పట్టుబడితే ఆరునెలల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా ఉంటుందని హెచ్చరించారు. ఎవరైనా నాటుసారా విక్రయిస్తే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇదివరకు నాటుసారా విక్రయిస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మందిని అధికారులు బైండోవర్ చేశారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కడెం: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి, డీపీఈవో రజాక్ ఆదేశాల మేరకు మండలంలోని పాండ్వపూర్, అంబారిపేట్, నవాబ్‌పేట్, పెద్దూర్, బెల్లాల్ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేక్ తెలిపారు. దాడుల్లో ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 200 లీటర్ల బెల్లం పానకం పారబోసినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. డీటీఎఫ్ ఎస్సై సింధు, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణహత్య

- ఉదయం బడికి బయలుదేరిన గజానంద్
- మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు తలపై దాడి
- ఆదిలాబాద్ జిల్లా అర్జుని కొలాంగూడ శివారులో ఘటన


ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్ మృతదేహం

నార్నూర్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురైన సంఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నార్నూర్ మండలం నాగల్‌కొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్‌ఐ జాదవ్ బిక్కు మూడో కుమారుడు గజానంద్(40) జైనథ్ మండలంలోని మేడిగూడ (కే)లో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పాఠశాల దూరంగా ఉండడంతో మూడేళ్లగా జిల్లా కేంద్రంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో సొంతూరుకు వచ్చాడు. ఇటీవల మూడు రోజుల పాటు బడిబాటకు హాజరయ్యాడు. బుధవారం పాఠశాల పునఃప్రారంభం కావడంతో సొంత ఊరు నుంచి ఉదయం ఏడు గంటలకు బైక్‌పై బయలుదేరాడు. 8గంటల సమయంలో భార్య విజయలక్ష్మి ఫోన్ చేయగా నెట్‌వర్క్ పరిధిలో లేనట్లు వచ్చింది. మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆమె ఆందోళనకు గురైంది. వెంటనే తన మరిది కుమారుడు సాయంతో ద్విచక్రవాహనంపై పాఠశాలకు బయలు దేరారు. ఈ క్రమంలో గాదిగూడ మండలం అర్జుని కొలాంగూడ శివారులో ప్రధాన రోడ్డుపై బైక్ కనిపించింది. సమీపంలో గాలించగా వ్యవసాయ పొలంలో తలకు తీవ్ర గాయాలతో గజానంద్ విగత జీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రహీంపాషా అక్కడికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంను రంగంలోకి దించి విచారణ చేపట్టారు. మృతుడిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి హతమార్చినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి తండ్రి జాదవ్ బిక్కు ఫిర్యాదు మేరకు అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు.

రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణకు జిల్లా బాధ్యులు


శిక్షణ తరగతుల్లో జిల్లా నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈనెల 10 నుంచి 14వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్ర అశోక్ హాజరయ్యారు. విద్యార్థి దశలో మూఢనమ్మకాలపై అవగాహన, చదువు, శాస్త్ర విజ్ఞానం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా నుంచి సాయికుమార్, కార్తీక్, ప్రశాంత్, అనిల్ హాజరైనట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీసు అధికారి

ఎదులాపురం: పట్టణంలోని అంజద్‌ఖాన్‌కు చెందిన రూ.70వేల విలువ గల మొబైల్‌ను స్థానిక బొక్కలగూడలో నెల క్రితం పోగొట్టుకున్నాడు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ పోలీసులు రికవరీ చేశారు. బాధితుడికి సీఐ సత్యనారాయణ బుధవారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఇందులో ఐటీ కోర్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, హన్మంతు ఉన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి


బస్టాండ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ప్రణీత్

భైంసాటౌన్: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్ సూచించారు. బుధవారం భైంసా డిపోను సందర్శించారు. లక్ష్యే లక్ష్యంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే భైంసా డిపో అత్యధిక ఈపీకే సాధించిందని చెప్పారు. ఈ మేరకు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. అనంతరం బస్టాండ్‌కు చేరుకుని దుకాణాలు, స్టాళ్లు పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, స్టేషన్ మేనేజర్ కేకే రెడ్డి ఉన్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన సదరు యువతి బుధవారం వరకు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీరాంనగర్ కాలనీలో యువకుడు..

మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన సాయికృష్ణ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై తెలిపారు. సాయికృష్ణ వారం క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో చంటి సత్తా


పవార్ చంటి

నేరడిగొండ: మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన పవార్ చంటి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తా చాటాడు. ఎస్సీ కేటగిరీ విభాగంలో 422వ ర్యాంక్ సాధించాడు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో స్టార్–50 పేరిట శిక్షణ పొందాడు. అధ్యాపక బృందంతో పాటు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఉట్నూర్‌లో ప్రవేశాల గడువును ఈ నెల 10 నుంచి 14 వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె. రమేశ్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు http:// iti. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1.8.2024 నాటికి 14 ఏళ్లు నిండి 8వ, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 94902 02037 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సుద్దగూడ గ్రామ రైతు ఆత్రం బాదిరావ్‌కు చెందిన ఎద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మంగళవారం కురిసిన వర్షానికి విద్యుత్ తీగ తెగిపడగా మేతకు వెళ్లిన ఎద్దు దానికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. వానాకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీరాజ్, వైద్యశాఖల అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్లు, ముఖ్య కూడళ్లు, డ్రైనేజీల్లో వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. డెంగీ, మలేరియా, అతిసార వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. క్లోరినేషన్ తర్వాతే తాగునీరు సరఫరాచేయాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.పారిశుద్ధ్య సిబ్బంది తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, వారానికి రెండు రోజులు డ్రైడే పాటించాలని ఆదేశించారు. ఈనెల 12 నుంచి 19వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. డీపీవో శ్రీనివాస్, జెడ్పీసీఈవో గోవింద్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, పీహెచ్‌సీల డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

బడిబాట.. పట్టలే!





బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. అయితే ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు బడికి రాకుండా ఇలా స్కూల్ సమీపంలోనే గోలీలు ఆడుతూ కనిపించిన దృశ్యమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఇచ్చోడ: పాఠ్యపుస్తకాల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని ఎంఈవో ఉదయ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 77 పాఠశాలలకు సరిపడా పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీవో సురేష్, ఎమ్మార్పీలు శ్యాంసుందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య బోధించాలి

బోథ్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని కుచులాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలను ప్రారంభించారు. విద్యార్థుల భవిత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, బోథ్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నల్లానీరు అందించడమే లక్ష్యం

ఇచ్చోడ: ఇంటింటికీ నల్లానీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం కోకస్‌మన్నూర్‌లో మిషన్ భగీరథ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు ప్రతీ ఇంటికి అందించమే సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ఆయన వెంట కారోబార్ గోగరి సుభాష్, తదితరులు ఉన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

గుడిహత్నూర్: రైతులు విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రేవతి అన్నారు. బుధవారం మండలంలోని పలు విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం చింతగూడలో వానాకాలం సాగు సన్నద్ధతపై విత్తనాలు విత్తుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని చెరకవాయి, ముత్నూర్‌తాండ, బొర్రమద్ది గ్రామాల్లో ఏఈవోలు శ్రీధర్, వెంకట్, స్రవంతి రైతులకు అవగాహన కల్పించారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, వైస్ చైర్మన్

కైలాస్‌నగర్: బక్రీద్‌ను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని మజీద్‌ల సదర్‌లు, ఇమామ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా మున్సిపల్ చెత్త వాహనాలకు మాత్రమే అందించాలని సూచించారు. ప్రతీ సంవత్సరంలాగే ఈసారి బక్రీద్‌కు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏమైనా ఇబ్బందులుంటే మున్సిపల్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



వాలీబాల్ కిట్ అందజేస్తున్న సీఐ ఫణీందర్

తలమడుగు: మండలంలోని పల్సి(కే) గ్రామంలోని యువకులకు బుధవారం ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ వాలీబాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్సై సురేందర్, ఠాకూర్ జైసింగ్, రాము, ప్రధానోపాధ్యాయులు సురేందర్ పాల్గొన్నారు.

సర్కారు బడులు పేదలపాలిట వరాలు

- ఎంపీ గోడం నగేశ్
- బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆదిలాబాద్‌టౌన్: యూనిఫాం అందజేస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడులు పేదల పాలిట వరం లాంటివని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సెక్టోరియల్ అధికారులు సుజాత్ ఖాన్, స్టేప్ సీఈవో వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్ తదితరులు పాల్గొన్నారు. భుక్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, విద్యాశాఖ సూపరింటెండెంట్ మమత, ఎంఈవో జయశీల, కౌన్సిలర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

నేరడిగొండ: ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్‌లో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు పద్మావతి, హర్షిత, శ్రీనిధిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు ఉదయశ్రీ, నారాయణ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంఈవో భూమారెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఎంపీటీసీ అంబేకర్ పండరి, మహిళా సమాఖ్య సంఘం జిల్లా అధ్యక్షురాలు వనజ, ఐకేపీ ఏపీఎం ఉత్తమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బడిబాటలో భాగంగా పాఠశాల పునఃప్రారంభంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ లక్ష్మి, ఎంఈవో శ్రీకాంత్, ఏపీఎం రవీందర్, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వర్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

నార్నూర్: నేటి బాలలే రేపటి పౌరులని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కనకమోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాం నాయక్, పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేష్, ఎంఈవో రాపల్లి ఆశన్న, ప్రధానోపాధ్యాయురాలు అనిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించారు

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించారని ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. మండలంలోని యాపల్‌గూడలో నిర్వహించిన కార్యక్రమంలో



నార్నూర్‌లో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



ఆదిలాబాద్‌రూరల్: అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఎంపీపీ రమేశ్ పాల్గొని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో నూతన భవనాలు, మరుగుదొడ్లు ప్రారంభించారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఎంపీవో వెంకటరాజు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలతో బోధన

గుడిహత్నూర్: సర్కారు బడుల్లోనే సకల సౌకర్యాలతో కూడిన బోధన అందించడం జరుగుతోందని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి సునీత అన్నారు. మన్నూర్ జెడ్పీఎస్ఎస్, గుడిహత్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తాగునీటి నల్లాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో నారాయణ, హెచ్‌ఎంలు దేవదాస్, సంతోష్, ఐకేపీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

బోథ్: జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. మోడల్ స్కూల్‌లో వీవో అధ్యక్షురాలు శోభ పుస్తకాలు, దుస్తులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్, హెచ్‌ఎం కుమ్మరి పోశెట్టి, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీఎం మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఇచ్చోడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి పుల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎంపీడీవో లక్ష్మణ్, ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందుతోందని భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ అన్నారు. అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, బుక్స్, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గోట్కూరిలో పాఠశాలలో నిర్వహించిన బడిబాట, పాఠశాల పునఃప్రారంభంలో ఎంపీపీ మంజుల పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి కిషన్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, హెచ్‌ఎంలు శ్రీకాంత్, వీరేందర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సౌజన్య, నర్సయ్య, ఉపాధ్యాయులు పార్వతి, సుమంక పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్‌లో...

బజార్‌హత్నూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. పలు పాఠశాలల్లో బెలూన్లతో తోరణాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ అజాడే జయశ్రీ, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ గంగాధర్, ఎంఈవో శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు నరేష్, రాజశేఖర్, గోడం చందన్, భగత్ బాపురావ్, కిషన్‌గుప్తా, కౌసలా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలమడుగు: ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత నిస్తోందని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. సుంకిడి, తలమడుగు, రుయ్యాడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'బడిబాట' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం, తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లు ప్రారంభించారు. ఎంపీపీ కళ్యాణం లక్ష్మీరాజేశ్వర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీటీసీ వెంకన్న యాదవ్, తలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బేల: విద్యార్థులు బాగా చదవాలని ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, మండల ప్రత్యేక అధికారి శంకర్ అన్నారు. ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేష్, ఐకేపీ ఏపీఎం రాజారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బేబితాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివి తహసీల్దార్‌నయ్యా..

తలమడుగు: ప్రభుత్వ పాఠశాలలో చదివి తహసీల్దార్‌నయ్యానని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. బరంపూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రత్యూష, ఎంపీటీసీ రంజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండ: బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే



తాంసిలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి



గుడిహత్నూర్: మాట్లాడుతున్న ఎస్సీ సంక్షేమాధికారి సునీత



బోథ్: దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ



ఇచ్చోడ: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి



బజార్‌హత్నూర్‌లో పూలతో స్వాగతం



తలమడుగు: భవనం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



తాంసి: బుక్స్ అందజేస్తున్న జెడ్పీటీసీ సుధాకర్

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



లక్కీడ్రాలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ట్రైబల్ వెల్ఫేర్ బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఎంపీపీ జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత పాల్గొన్నారు.

బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే

అనంతరం మండలంలోని లక్కారంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శామ్యూల్, శ్రీనివాస్, అలాకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఇటీవల అకాల మరణం పొందిన ఐకేపీ ఏపీఎం లింగంపల్లి గంగన్న కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని బీంనగర్‌లో బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, నాయకులు ఎండీ మసూద్, జహిత్, జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో గల బీసీ వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వార్డెన్ జావిద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంద్రవెల్లిలో 68, ఉట్నూర్‌లో 35 సీట్లుగా ఖాళీగా ఉన్నాయన్నారు. 3వ తరగతి నుండి పదో తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9441908589 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక చేయూత

ఆదిలాబాద్‌రూరల్: కాలేయ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన మదన్నా రాకేష్ కుటుంబ సభ్యులకు మున్నూరు కాపు కులస్తులు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గండ్రత్ సంతోష్, బండారి ప్రమోద్, కాళ్ల విఠల్, కాస్తల అరుణ్, సంతోష్, అన్నం ప్రభాకర్, విఠల్, కోరెడ్డి శంకర్, ఆడేళ్ల, తిరుపతి, స్వప్నిల్, తదితరులు ఉన్నారు.

'భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు'

ఎదులాపురం: అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అట్రాసిటీ కేసు పేరుతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని జర్నలిస్టు జేఏసీ చైర్మన్ నూకల దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు రిపోర్టర్‌ను బెదిరించడమే కాకుండా, అట్రాసిటీ కేసు నమోదు చేస్తా అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. అధికార పార్టీ కార్యక్రమాలకు నల్లబ్యాడ్జీలు ధరించి కవరేజీ చేసేందుకు జేఏసీ నిర్ణయించిందన్నారు. సమావేశంలో సురేశ్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, నరేశ్, వినోద్, రఘు, సారంగపాణి, అరుణ్, దేవిదాస్, అభి తదితరులు పాల్గొన్నారు.

'టెట్'లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



గాజుల స్వామిచరణ్



సత్యనారాయణ



కురాడి చంద్రశేఖర్



అల్లాడి అజయ్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్/బోథ్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో పలువురు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బోథ్‌లోని సొనాల గ్రామానికి చెందిన గాజుల స్వామిచరణ్ పేపర్-1లో 131 మార్కులు, మండల కేంద్రానికి చెందిన అల్లాడి అజయ్‌కుమార్ 126 మార్కులు, అభిరామ్ 126 మార్కులు, జైనథ్ మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణ 122 మార్కులు, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కురాడి చంద్రశేఖర్ 121 మార్కులు సాధించాడు.

ఎంపీ గోడం నగేశ్‌కు శుభాకాంక్షల వెల్లువ



ఆదిలాబాద్‌టౌన్: సన్మానిస్తున్న నాయకులు



తాంసి: ఎంపీకి బొకే అందిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: ఎంపీగా ఎన్నికైన గోడం నగేశ్‌కు శుభాకాంక్షలు వెలువెత్తుతున్నాయి. బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, వైద్య ప్రజా ఉద్యోగుల సంఘం నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాదయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలబోజు గోపీకృష్ణ, ఆర్థిక కార్యదర్శి బచ్చువార్ నారాయణ, మహిళా అధ్యక్షురాలు కుర్సెంగ జీజాబాయి, సంగీత, జిల్లా నాయకులు అల్లూరి మనోజ్‌రెడ్డి, గోమంత్‌రెడ్డి, కుమర యాదవరావు, తొగరి ప్రకాశ్, తెలంగాణ వైద్య ప్రజా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి కృష్ణ, రఘురాం, బ్రహ్మానంద రెడ్డి, రమణాచారి, రవీందర్ రాథోడ్, మహేందర్, కృష్ణ, ప్రమోద్, విజయ్, మాల సంక్షేమ సంఘం నాయకులు అశోక్, ప్రకాష్, మల్లన్న, పాశం రాఘవేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు రాధా, కవిత, సునంద, సుజాత, సవిత, మీనాక్షి, శోభ, అక్కమ్మ, నిషాత్, ఆఫ్రిన్, పొచ్చుబాయి, ఆశబాయి తదితరులు పాల్గొన్నారు.

తాంసి: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను భీంపూర్ మండల బీజేపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు రెడ్డి రమేశ్, రాంప్రసాద్, దిలీప్, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల తాలూకు 33కేవీ లైన్‌కు జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ రెవెన్యూ గ్రామ శివారులో నూతన ఏబీ స్విచ్ బిగింపు పనులు చేపట్టడానికి ఈ సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'భౌతిక దాడులు సరికాదు'

ఆదిలాబాద్‌రూరల్: నిర్మల్ జిల్లా తానూరు మండలం మహాలింగిలో గౌడ కులస్తులపై భౌతిక దాడులకు దిగడం సరికాదని గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతకార్మికులపై దాడులు ఖండిస్తున్నామన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సమితి గౌరవ అధ్యక్షుడు భూపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ధ్వజారోహణ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని బెల్లూరి అయ్యప్ప ఆలయంలో బుధవారం తొలి ధ్వజారోహణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా తొలిసారిగా ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కేరళలోని శబరిమల దేవాలయ గురుస్వామి గణపతి నంబోద్రి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో కేవలం ఎంపీటీసీలు, ఇతర అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో ప్రారంభమైన గంటలోపే సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సావాపూరే విజయ్ కుమార్, ఎంపీడీవో రవీంద్రనాథ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీటీసీలు కొడిచర్ల సుదర్శన్, లోక కరుణాకర్‌రెడ్డి, కట్కూర్ల మహేందర్, కోల భోజన్న, సోమ ఇందిరా బాయి, కామ్రే జయమాల, పెందూర్ శారద, పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన మునిగెల నర్సింగ్



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నర్సింగ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మునిగెల నర్సింగ్ బుధవారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పార్టీకి అందించిన సేవలు వివరించారు.